# గల్లంతు

రాజమౌళికి జాబొచ్చింది. జాబ్ రావటమంటే లాటరీలో బంపర్‌ప్రైజ్ తగిలినట్టు... ఫ్లాపవుతుందేమోని అన్పించిన సినిమా వందరోజులు ఆడినట్టు... ఫస్ట్ ఛాన్సులోని ఎం.ఎల్.ఏ. గా గెలిచిన అభ్యర్థికి కేబినేట్ హోదా మినిస్టర్ పదవి వచ్చిందానికంటే కోటి రెట్లు ఎక్కువన్నమాట!

సినిమా హిట్టయితే హీరో హీరోయిన్లకి... దర్శక నిర్మాతలకు ఫ్యూచరుంటుంది. ఫ్లాపైతే ఇంతే సంగతులు! ఇండస్ట్రీలో శాల్తీలు గల్లంతే!

ఉద్యోగం అట్లాకాదు. నలభై ఏళ్ళ పంట! ఇన్‌కమ్ గ్యారంటీ. ఏ కోన్కిస్కా గాడైనా కాళ్ళు కడిగి పిల్లనిస్తాడు. అందునా... రైల్వేలో ఉద్యోగమంటే మాటలా? లక్షల్లో కట్నం రేటు పలుకుతుంది. ఏ మెగాస్టారో... సూపర్ స్టారో ఇంటి ముందు అభిమానులు 'క్యూ' కట్టినట్టు... ఆడపిల్ల తండ్రులు బారులు తీరి నిలబడతారు.

అఫ్ట్రాల్ ఒక్క పెళ్ళన్న మాటేమిటి? బ్యాంకుల వాళ్ళు లోన్లు ఇస్తామంటూ ఫోన్ల మీద ఫోన్లు. ఇన్సూరెన్స్ ఏజెంట్లు జిడిలా పట్టుకుని వదలరు.

ఓహ్! లైఫ్ థ్రిలింగ్‌గా ఉంటుంది. హ్యాపీగా రోజులు గడుస్తయ్. డోంట్‌కేర్ మాస్టర్లా తిరగచ్చు.

కాస్త... ఒక్క ఏడాది బుద్ధిగ, శ్రద్ధగ ఆఫీసులో పని నేర్చుకుంటే చాలు. కొలీగ్స్‌ని డామినేట్ చేసేయ్యొచ్చు. కన్ఫరమ్ అయితే ఇక ఢోకా ఉండదు. రేట్లు ఫిక్స్ చేసి చేతులు చాపవచ్చు. ఎ.సి.బి. వారికి దొరక్కుండా ఉంటే తిమింగిలమంత కాకపోయినా, రిటైర్మెంట్ నాటికి ఎట్‌లీస్ట్... సొరచేపంతగా ఎదిగి, పై సంపాదనతో రెండు ఇళ్లు, నాలుగెకరాల పొలం, తూర్పుగోదావరి జిల్లాలో పదెకరాల కొబ్బరి తోటకి ఓనర్రై పోవచ్చు.

దేవుడిని నమ్మేవాడు రాజమౌళి! రైల్వే సిగ్నల్ పోల్‌లాగ అందంగా ఆరడుగుల ఎత్తుంటాడు. తెల్లని శరీర ఛాయ, కర్లీ హెయిర్, ఛాంగు భళా లాగా... ఝామ్ ఝామ్మంటూ హుషారైనవాడు.

ఎదుటివారితో జోకులస్తూ మాట్లాడతాడు. ఎలాంటి వారినైనా 'మేగ్నెట్లా' ఆకర్షించే గుణముంది.

కేంద్ర ప్రభుత్వోద్యోగం... అందునా విజయవాడకి పోస్టింగ్ రావడమంటే మాటలా? ఎంత లక్ ఉండాలి? నేటివ్ ఆఫ్ మంగళగిరే కాబట్టి ఎంచక్కారోజు స్కూటర్ మీద విజయవాడలో గల ఆఫీసుకి వచ్చి వెళ్ళొచ్చు. అంత స్ట్రెయినెందుకనుకుంటే... దగ్గర్లో గాంధీ నగరం సెంటర్లో ఓ రూమ్ తీసుకుని ఉండొచ్చు. రోజూ స్కూటర్ మీద వెళ్ళి రావటానికి మమ్మీ ఒప్పుకోదు. ఒక్కగానొక్క కొడుకు కదా! గారాబు పట్టి! ట్రాఫిక్ హెవీగా ఉంటుంది. ఏ యాక్సిడెంటైనా జరిగితే... అమ్మో!

విజయవాడ సిటీ లైఫ్... ఆల్మోస్ట్ అద్భుతంగా ఉంటుందని రాజమౌళికి బాగా తెలుసు. లయోలా కాలేజీలో డిగ్రీ చేసినవాడు కదా! అందులోనూ... ఉద్యోగం వచ్చాక విజయవాడలో ఉండటమంటే మూడు పువ్వులు... ఆరు కాయలు... జల్సాగా ఉంటుంది.

మంచి నాటక సమాజన్నెంచుకుని వేషాలు వెయ్యొచ్చు. ప్రదర్శనలీయ్యొచ్చు. సినిమా హాల్స్‌కి, బార్‌లకి, క్లబ్బులకు కొదవేలేదు. జోరీగల్లా తిరిగే సిటీ బస్సులు, శతదినోత్సవాలకు వచ్చిపోయే సినిమా యాక్టర్లు... సిటీ సందడిగా ఉంటుంది. అందుకే రాజమౌళికి వియవాడంటే అంత ఇష్టం. మరెక్కడైనా ఉద్యోగం వచ్చి ఉంటే పోయేవాడు కాదేమో!

ఆఫీసు టైమ్ కాగానే... ఇంటికొచ్చి (సారీ... రూమ్‌కొచ్చి... బ్యాచ్‌లర్ కదా!) స్నానం గట్రా చేసి డ్రెస్ మార్చుకుని టిప్‌టాప్‌గా తయారై - గవర్నర్ పేట సెంటర్లో వచ్చీపోయే అమ్మాయిలకు బీటెయ్యొచ్చు! ఉచ్చులో పడితే లవ్వాడేయ్యొచ్చు.

× × × × ×

రాజమౌళి డాడీ మాజీ మినిస్టర్! చాలాసార్లు ఎం.ఎల్.ఏగా పోటీ చేసి గెలిచాడు. అతడిని కాదని మరో వ్యక్తికి ఓటు వెయ్యగల దమ్ములెవ్వు. ప్రజల సొమ్ముకోసం ఆరాటపడే మనిషి కాదు. ప్రభుత్వ సొమ్ము అందినంతమేరకు బొక్కేద్దామన్న దుర్బుద్ధి... దురాలోచన లేనివాడు కావటంతో ఏం సంపాదించుకోలేకపోయాడు మహనంది.

మహానంది నికార్సైన నిజాయితీపరుడు. పోలీసు డిపార్ట్‌మెంట్లో... రాజకీయాల్లో.. మహానంది వంటి నిజాయితీ పరులుండటం ఆశ్చర్యమే మరి!

సహాయం కోరి ఎవరు తనని ఆశ్రయించినా ఉదారంగా చేసిపెట్టే మనస్తత్వం కలవాడు కావటాన... పెరాలసిస్ బారినపడి దుర్భరమైన జీవితాన్ని గడపాల్సి వచ్చింది. మంగళగిరిలో ఉండే ఇల్లు భార్య పుట్టింటి వారిచ్చిందే కావటంతో ఒక్కగానొక్క కొడుకుతో అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది.

స్వాతంత్ర్య సమరయోధుడైన కారణంగా ప్రభుత్వం వారిచ్చిన అయిదెకరాలు భూమి మాత్రం మహానంది స్వంతం. మినిస్టర్‌గా ఉన్న రోజుల్లో కూడా ఆయన కారుల్లో తిరగటానికి ఇష్టపడేవాడు కాదు. గన్‌మేన్లను ఇస్తామన్నా అక్కర్లేదన్నాడు. అసెంబ్లీకి, సచివాలయానికి కాలినడకనే వెళ్ళటం మహానందికి అలవాటు. ఖద్దరు తప్ప కట్టేవాడు కాదు. తనకు పదవి కావాలంటూ యాచించలేదు.

ప్రజాసేవే నరవెూధర్మః అనుకునే స్వభావం! సామాన్యుల్లో మమేకమైపోయాడు.

ఆయన అసలు పేరు మల్లయ్యంటే ఎవరికీ తెలీదు. మహానంది ఇంటి పేరే ఆయన పేరైంది. ఆ పేరుతోనే పాపులర్ అయినాడు. రాజమౌళి చదువులో ఎక్కొచ్చి.. డిగ్రీలో అడుగుపెట్టే తరుణంలో మహానంది మంచాన పడ్డాడు. కొడుకు భవిష్యత్‌కి తాను ఏవిధంగానూ ఉపయోగపడలేకపోయాననే దిగులు మహానందిని మరింత కృంగదీసింది.

× × × × ×

జాబ్ వచ్చిన యంగ్ హాండ్సమ్ హీరో రాజమౌళి మకాం మంగళగిరి నుంచి విజయవాడకు మార్చగానే స్కూటర్ కొన్నాడు.

ఇంకేముంది? టింగురంగా అంటూ ఆఫీసు అవర్స్ అయిపోగానే స్కూటర్ మీద చక్కర్లు! బడ్డీకొట్టువాడు కట్టి ఇచ్చిన "కిమామ్ ముష్కి" కిళ్ళీ నములుతూ... ఫిల్టర్ సిగరెట్ కింగ్ సైజుది(సారీ.. పొగతాగుట హానికరం!) వెలిగించి స్మోక్ చేస్తూ-రోడ్డువెంట వెళ్ళే అందమైన అమ్మాయిలను చూస్తూ అలంకార్ హోటల్ వద్ద నిలబడి తెగ ఫోజు కొట్టేస్తున్నాడు.

అరేంజ్‌డ్ మ్యారేజెస్ పట్ల రాజమౌళికి బొత్తిగా లైకింగ్ లేదు. లవ్వాడి పెళ్ళాడాలన్నదే అతడి జీవితాశయం. అందుకే అందమైన అమ్మాయి కోసం అతగాడి వేట!

ఉద్యోగం లేకపోవటాన... ఇన్నాళ్లుగా తాను ఏ ఆడపిల్ల వెంటా పడ్లేదు. లవ్ చేయలేదు. పైగా జల్సాగా ఖర్చు పెట్టటానికి జేబులో పైసలుండవ్! పేరెంట్స్‌ని అడగటానికి మనస్కరించేది కాదు.

ఇప్పుడు తాను ఫ్రీ బర్డ్! సంపాదించే స్థాయికి ఎదిగాడు. ఇకనుండి తన ఎర్నింగు.. తనిష్టం! జీతం అంతా తనే ఖర్చు పెట్టుకోవచ్చు. అందుకే - ఇక తాను ప్రేమలో పడొచ్చు. కంటికి నచ్చిన అమ్మాయికి లైనేసి లవ్‌లో పడేయ్యొచ్చు.

అమ్మాయంటే అలాంటి ఇలాంటి... సాదాసీదగా గరల్ కాదు. మెడికో అయి ఉండాలి. డాక్టరమ్మాయిని లవ్వాడి మ్యారేజ్ చేసుకోవాలన్నదే రాజమౌళి జీవితాశయం.

తనేమో గ్రాడ్యుయేట్. కనీసం పి.జి. అయినా చేయలేదు. అలాంటి తనకు డాక్టరమ్మాయి దొరుకుతుందా? డాక్టరమ్మాయి స్థాయి హై లెవెల్లో ఉంటుంది కదా! కారు, బంగళా, బ్యాంకు బ్యాలెన్స్, రిచ్‌జాబ్ కోరుకుంటూంటారని ఫ్రెండ్స్ చెప్పగా విన్నాడు రాజమౌళి.

అయినా తన పిచ్చిగానీ... ఐ.ఏ.ఎస్ ఆడాళ్ళు అటెండర్ని చేసుకున్న దాఖలాలు అనేకం ఉన్నాయన్పించింది. ప్రేమ గుడ్డిది కదా! దానికి అంతస్థుల భేదాలు లేవనేది ఒక రూలు.

ఒకరినొకరు ఆకర్షించుకోగలిగితే చాలు! దట్సాల్... తనకు తాను నచ్చచెప్పుకున్నాడు. సిగరెట్ ఫినిష్ చేసి, నేలమీద వేసి బూటుకాలితో నలిపి స్కూటర్ దగ్గరకు వెళ్ళబోతున్న క్షణంలో...

ఓ మెరుపుతీగ, అందచందాల లావణ్యవతి ప్రాయంలో ఉన్న కన్నెపిల్ల, తాను కోరుకునే కొలతలున్న బాడీ... మెడలో స్టెత్... ఒంటిన 'ఏప్రాన్'తో హోయలొలకపోస్తూ కలహంసలా ఒంటరిగా హోటల్లో కెళ్ళింది. ఆ అమ్మాయిని చూడగానే - కొడితే సిక్స్ కొట్టాలన్నట్టు, పడితే (లవ్‌లో) అలాంటి అమ్మాయి వెంటపడి లవ్వు ఉచ్చులోకి ఆ లేడీని లేడిపిల్లలా లాగేసి పడెయ్యాలన్పించింది చంద్రమౌళికి.

తాను కోరుకునే లక్షణాలన్నీ ఆమెలో పుష్కలంగా ఉన్నాయని మురిసాడు.

వాహ్! ఏంబ్యూటీ? అందగత్తెలకే అందగత్తెలా ఉంది. ప్రపంచసుందరి సైతం ఈమె ముందు బలాదూర్ అన్పించింది రాజమౌళికి ఆ క్షణంలో!

అంతటి సుందరాంగి... రూపసి కళ్ళబడగానే రాజమౌళి నోట్లో లాలాజలం ఊరింది. పళ్ళు పులిసినయ్. ఒళ్లు పులకరించింది. వాట్ ఎ బ్యూటీ అనుకున్నాడు.

క్షణం క్రితమే తాను కాఫీ తాగి బైటికొచ్చి కిళ్ళీ నములుతున్నా... నోట్లో పాన్ నేల మీద ఉమ్మాడు. ఆ అమ్మాయి కోసమైనా మళ్ళీ హోటల్లోకెళ్ళి ఆమెకెదురుగా ఉన్న చైర్లో కూర్చుని, ఆమె సౌందర్యాన్ని ఆరాధిస్తూ... కాఫీతో పాటు ఆస్వాదించాలన్పించింది.

లవ్ అంటే ఇదేనేమో! ఆ అతిలోక సుందరి తనకోసమే పుట్టింది. అందుకే తన కళ్ళ పడింది. ఈరోజు నిద్రలేచిన వేళావిశేషం అద్భుతంగా ఉంది. అందుకే ఈ పాప తన కంట పడింది. రకరకాలుగా తలపోస్తూ తనూ లోపలికెళ్ళాడు. సుందరి ఎక్కడ ఆసీసురాలైందోనని రాజమౌళి కళ్లు నాలుగువైపులా వెతికి... మొత్తానికి ఓ మూల కూర్చున్న ఆమెను 'ట్రేస్' చేసాడు.

తాను లక్కీ ఫెలో కాబట్టే- ఆమె ఎదురు సీటు ఖాళీగా ఉంది.

రెప్పపాటులో హనుమంతుడిలా అక్కడికి లంఘించి ఆమె ఎదురుగా ఉన్న చైర్లో అసీనుడైనాడు.

ఆమె తనవైపు చూసింది. తాను సిగ్గుపడ్డాడు. తాను ఆమె వైపు చూసినప్పుడు ఆమె తలదించుకుని ఓరకంట చూసింది. ఆమె తనను క్రీగంట వీక్షిస్తూంటే.. శరీరం ఉద్రేకానికి లోనై టెంపరేచర్ పెరిగినట్టన్పించింది చంద్రమౌళికి.

మాటలు కలపాలని ప్రయత్నించి తడబడ్డాడు. బలహీనతను క్లవర్‌గా కవర్ చేసుకుంటూ-

"మీరు మెడికోనా?" అడిగాడు

ఫక్కున నవ్వి తలపంకించింది.

"ఏ ఇయర్ స్టూడెంట్ మీరు?" మరో ప్రశ్న బాణంలా సంధించాడు

"ఫైనలియర్..." మొత్తానికి తిలోత్తమ నోరు విప్పింది.

"నేను..." పరిచయం చేసుకునే ప్రయత్నంలో ఉండగా ఆమె కట్‌చేస్తూ-

"నాపేరు లావణ్య!" అని మరో అడుగు ముందుకేసింది.

"వాట్ ఎ బ్యూటిఫుల్ నేమ్!" మీ పేరుకు తగ్గట్టుగా ఉన్నారు మీరు.

"మీరు చాలా మేన్లీగా... హాండ్సమ్‌గా ఉన్నారు!" రెప్పలు

టపటపలాడించింది సినిమా హీరోయిన్లా. తన రొట్టె విరిగి విస్కీలో పడ్డట్టు అన్పించింది. శరీరం పులకింపుతో జలదరించింది.

తర్వాత ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో కన్ఫ్యూజై... పళ్ళికిలించి "ఇలా ఇవ్వండి... మీ బిల్లు నేను పే చేస్తాను." అనేసి లాక్కున్నాడు. నడుస్తూ "మళ్ళీ రేపు కలుద్దాం..." అని బై చెప్పి వడిగా నడుచుకుంటూ వెళ్ళి ఆటో ఎక్కింది లావణ్య.

× × × × ×

రాజమౌళికి లావణ్యతో ఫ్రెండ్‌షిప్ పెరిగింది. ఇద్దరూ ఒకే ఆటోలోనో... లేదూ... ఆమెను తన స్కూటర్ వెనుక కూర్చోపెట్టుకుని సినిమాలకు, షికారల్లకు... హోటళ్ళకు రాసుకు పూసుకు తిరగటం దాకా వెళ్ళింది. లావణ్యకు తానింకా దగ్గరవ్వాలని రాజమౌళి మనసు తహతహలాడుతోంది.

ఆమె సాన్నిహిత్యం చంద్రమౌళిని మత్తెక్కిస్తోంది. ఆమెకు డ్రెస్‌లు... బ్రాలు కొనిచ్చే స్థాయికి ఎదిగాడు. ఇన్నేళ్ళూ తను ఇదే కావాలని కోరుకున్నాడు. కలలు కన్నాడు. ఓహ్! అదృష్టం తనని ఇన్నాళ్ళకి వరించింది.

రాజమౌళి లావణ్య వెంట తిరగటం... ఆఫీసు కొలీగ్స్ కళ్ళల్లో దుమ్ములా పడింది.

"ఏం గురూ.. లాగిస్తున్నావా?" భావగర్భితంగా పక్క సీట్లో రామ్మూర్తి అడిగాడు రాజమౌళిని.

"ఛ! అదేం లేదు... ఊరికే షికార్లు... సినిమాలే!"

"లవ్వా?" మరో రాయి విసిరాడు.

"ఆల్మోస్ట్... అలాంటిదే!"

"అదొట్టి పోరంబోకు గురూ!"

సీరియస్సయ్యాడు రాజమౌళి.

"ఆపండి మీ కామెంట్స్! ఆ అమ్మాయిని... అదే మెడికోని... లావణ్యని మ్యారేజ్ చేసుకోబోతున్నాను త్వరలో..." మనసులో కోరిక చెప్పేసాడు.

"వామ్మో! నువ్వయిపోయావ్. దానిపేరు లావణ్యని చెప్పిందా? మోసపోయావ్ గురూ! రోజుకొకడితో తిరుగుతుంది. మనిషికో పేరు చెప్తుంది.

కొత్తవాళ్ళని వల్లో వేసుకుంటుంది... ఆర్పేస్తుంది.''

కొలీగ్ మాటలు వింటూంటే అతని మాటలు నమ్మశక్యం కాలేదు రాజమౌళికి. పొంగివచ్చే కోపాన్ని బలవంతాన ఆపుకున్నాడు.

''వాళ్ల అమ్మ ... మాఇంట్లో పాచిపని చేసేది. ఇది దాని కూతురు. టెన్త్ తప్పి ఇక చదవనందిట కూతుర్ని బిజినెస్‌లోకి దింపింది. కూతురొక చింతామణి. తల్లొక శ్రీహరి. ఇప్పటికి చాలామంది కుర్రాళ్లని, డబ్బున్న వాళ్లని ఆర్పేసింది. ఇప్పుడు నిన్ను పట్టింది. స్టెత్ చేతిలో ఉంటే డాక్టరనుకున్నావా? నువ్వొట్టి అమాయకుడివి. అదొక కేటుముండ. దాని చిన్నతనంలో అలంకార్ టాకీస్ వెనుక గుడిసెలో కాపురం ఉండేవాళ్ళు. ఇన్‌కమ్ పెరిగి, సిటీ నడిబొడ్డున మంచి ఇల్లు అద్దెకి తీసుకుని కూతురితో బిజినెస్ సాగిస్తోంది. దాని వలలో చిక్కుకుని గల్లంతైపోకు. నువ్వసలే లోకం తెలీని కుర్రాడవి!''

ఫ్రెండ్ మాటలు వింటూంటే రాజమౌళికి కొండమీది నుంచి అగాధంలోకి పడ్డట్టు ఫీలైనాడు.

ఇంకా నయం.... ఇప్పటికైనా మునిగిపోయింది లేదు. తెలివి తెచ్చుకుని మేలుకోగలిగాడు.

''నువ్వు లక్కీ ఫెలోవి. నువ్వు తొందరపడి ఉంటే - నీకు ఏ ''ఎయిడ్సో'' అంటించేంది. నువ్వు దాంతో తిరుగుతూ నాకంటపడ్డావ్ కాబట్టి - నీ శ్రేయోభిలాషిగా నీకు దాని బ్యాక్‌గ్రౌండేమిటో చెప్పగలిగాను. అది మేడిపండు గురూ!'' నిజాన్ని కుండబద్దలు కొట్టి చెప్పి తనను సేవ్ చేసినందుకు కొలీగ్‌ని అభినందించకుండా ఉండలేకపోయాడు రాజమౌళి.

(చిత్ర - మాసపత్రిక జూన్ 2010)